AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
3-11-2025 (Monday) MAIN EDITION

## ఇన్‌స్టాకు పోటీగా ‘వీరీల్స్’..

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్ :** ఒకప్పుడు టిక్ టాక్ యాప్ ఇండియాలో సంచలనం సృష్టించింది. చాలా మంది దీనిని వినియోగించేవారు. టిక్‌టాక్ రీల్స్‌తో పలువురు స్టార్లు గాను మారిపోయారు. తర్వాతి కాలంలో ఈ యాప్‌ను ప్రభుత్వం నిషేధించడంతో ఇన్‌స్టాగ్రామ్ వైపు మళ్లారు. ప్రస్తుతం ఈ యాప్‌నకు పోటీ ఇచ్చేందుకు వీరీల్స్ దూసుకొస్తోంది. అమెరికాలో నివసించే తెలుగు ఇంజినీర్లే దీనిని సృష్టించారు. అమెరికా, భారత్‌తో సహా 22 దేశాల్లో విడుదలైన ఈ యాప్ ప్రస్తుతం బీటా దశలో ఉంది. టోకెన్ ఆధారిత ప్రామాణీకరణ, ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్, యూజర్ నియంత్రిత ప్రైవసీ సెట్టింగ్స్ ఉన్నాయి.

## ఆధునిక సాంకేతికతతో ఎస్ఎల్‌బీసీ పనులు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఎస్ఎల్‌బీసీ పనులు పున: ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. హెలీమాగ్నెటిక్ సర్వేకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు వివరించారు. సీఎంతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకం పనుల పునరుద్ధరణలో భాగంగా ఈ రోజు నుంచి మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే చేపడుతున్నారు.

## కాశీబుగ్గ దుర్ఘటన దురదృష్టకరం



**అక్షరటుడే, అమరావతి:** కాశీబుగ్గలో చోటు చేసుకున్న దుర్ఘటన దురదృష్టకరం అని కేంద్ర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం లోక్ సభ సభ్యుడు కింజారపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతి చెందడం మనసును కలిచివేసిందన్నారు.

## తాత్కాలికంగా చీరాల బీచ్ మూసివేత




**అక్షరటుడే, అమరావతి:** ఇటీవల ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసిన మొంథా తుపాన్ ప్రభావం ఇంకా పూర్తిగా తగ్గలేదు. తాజాగా మరో అల్పపీడనం ఏర్పడడంతో వాతావరణ పరిస్థితులు మళ్లీ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై, చీరాల బీచ్‌ను తాత్కాలికంగా మూసివేశారు.

## ఆమె బౌలింగే మాకు సర్‌ప్రైజ్: లారా



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తీసుకున్న ఓ నిర్ణయం తమ కొంప ముంచిందని దక్షిణాఫ్రికా సారథి లారా వోల్వార్ట్ వెల్లడించింది. “షెఫాలీ బౌలింగ్ ఇలా ఉంటుందని మేం అస్సలు ఊహించలేదు. మాకు అది సర్‌ప్రైజ్. చాలా నెమ్మదిగా బంతిని సంధించింది. రెండు వికెట్లను కూడా తీసింది.” అని అన్నారు.

## బిహార్‌లో గెలుస్తాం..: తేజస్వీ యాదవ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బిహార్‌లో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. “ఈ నెల 14న శాసన సభ ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయి. 18న ప్రభుత్వం కొలువు దీరుతుంది. ఆరోజు ప్రమాణ కార్యక్రమం ఉంటుంది’’ అని తెలిపారు. జనసురాజ్ పార్టీకి మద్దతిస్తున్న దులార్ చంద్ హత్యకు సంబంధించి జేడీ(యూ) అభ్యర్థి, మొకామా మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ అరెస్టు నేపథ్యంలో తేజస్వీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## టాటా ట్రస్ట్ బోర్డు నిర్ణయాన్ని సవాల్ చేసిన మిస్త్రీ

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** టాటా గ్రూపులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు అంతర్గత విభేదాలు ముదురుతున్నాయనేందుకు అద్దం పడుతున్నాయి. రతన్ టాటాకు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మిస్త్రీని ఈ గ్రూపునకు లైఫ్ టైమ్ ట్రస్టీగా పునర్ నియమించేందుకు టాటా ట్రస్ట్స్ ఆమోదం తెలుపలేదు. దీంతో మిస్త్రీ ఆ నిర్ణయంపై న్యాయపోరాటం మొదలుపెట్టినట్లు సమాచారం. ముంబై ఛారిటీ కమిషనల్ ఎదుట టాటా ట్రస్ట్స్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. కెవియెట్ దాఖలు చేసినట్లు పలు జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి.

**ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వారిని కంకర లారీ రూపంలో మృత్యువు కబళించింది. పనులు, కాలేజీలకు వెళ్లడానికి తెల్లవారుజామునే బస్సు ఎక్కిన వారికి అదే చివరి ప్రయాణంగా మారింది. ఎన్నో ఆశలతో రోజును ప్రారంభించిన వారి జీవితాలను రోడ్డు ప్రమాదం అంతం చేసింది. ఇంట్లో నుంచి వెళ్లిన తమ వారు ఇక తిరిగి రారని తెలిసి వారి కుటుంబ సభ్యులు గుండెలవిసెలా రోదిస్తున్నారు.** –అక్షరటుడే, రంగారెడ్డి

# దూసుకొచ్చిన మృత్యువు



- చేవెళ్లలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంకర లారీ
- 19 మంది దుర్మరణం
- పలువురికి తీవ్ర గాయాలు
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఆర్టీసీ బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తాండూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సును మీర్జాగూడ సమీపంలో కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొంది. బస్సు ముందు భాగంలోకి లారీ చొచ్చుకుపోయింది. అందులోని కంకర ప్రయాణికులపై పడింది. దీంతో కంకరలో కూరుకుపోయి ఊపిరాడక పలువురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో 19 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు.



ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. మూడు జేసీబీల సాయంతో అధికారులు లారీ, బస్సులన తొలగించారు. క్షతగాత్రులను చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

### 72 మంది ప్రయాణికులు

ప్రమాద సమయంలో బస్సులో 72 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లేవారు తాండూర్‌లో బస్సు ఎక్కారు. కొద్దిసేపటికే ప్రమాదం జరగడంతో 19 మంది చనిపోయారు. బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా, లారీ డ్రైవర్ సైతం ఘటనలో మృతి చెందారు.

### ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి

రోడ్డు ప్రమాదంలో తాండూరుకు చెందిన అక్కాచెల్లెళ్ళు మృతి చెందారు. నందిని డిగ్రీ ఫస్టియర్, సాయి ప్రియ డిగ్రీ ఫైనలియర్, తనూష ఎంబీఏ చదువుతున్నారు. వీకెండ్ కావడంతో వారు స్వగ్రామానికి వచ్చారు. ముగ్గురిని తండ్రి బస్సు ఎక్కించి వెళ్లాడు. అంతలోనే ప్రమాదంలో మృతి చెందారు.

### పలువురి దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ. 50 వేల చొప్పున కేంద్రం సాయం ప్రకటించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

## ‘అలా అయితే నా ఇల్లు కూల్చేస్తా..’



**అక్షరటుడే, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. తన ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే తానే పడగొడతానన్నారు. లేదంటే కేటీఆర్ ముక్కు నేలకు రాస్తారా అని ప్రశ్నించారు. కేటీఆర్ ఆదివారం తెలంగాణ భవన్‌లో హైడ్రా ఎగ్జిబిషన్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల ఒకరకంగా, పెద్దల పట్ల మరో రకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి అన్న తిరుపతిరెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి నివాసాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నాయని, వాటి జోలికి హైడ్రా ఎందుకు వెళ్లదని ప్రశ్నించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై సోమవారం మంత్రి పొంగులేటి స్పందించారు. తన ఇల్లు పరిధిలో ఉందని నిరూపిస్తే తానే కూల్చేస్తానన్నారు. లేకపోతే అప్పా జంక్షన్‌లో కేటీఆర్ ముక్కు నేలకు రాయాలని సవాల్ విసిరారు. ఏ వ్యాపారం చేసి ఇన్ని ఆస్తులు సంపాదించారని ఆయన కేటీఆర్‌ను ప్రశ్నించారు.

## కేటీఆర్ కలలు కంటున్నారు..: కిషన్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియా చిట్ చాట్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, అది ఫామ్ హౌస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మరోసారి సీఎం అవుతారని కేటీఆర్ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. రెండేళ్లుగా కేసీఆర్ ఎక్కడా కనిపించలేదన్నారు. ప్రజల మధ్యకు రాని ఆయన మళ్లీ సీఎం ఎలా అవుతారని ప్రశ్నించారు.

### కాంగ్రెస్‌కు ఓటమి భయం


కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని కిషన్‌రెడ్డి అన్నారు. అందుకే ఓ వర్గం ఓట్ల కోసం ప్రయత్నాలు చేస్తోందన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని చెప్పారు. అది బీజేపీకి ప్లస్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికలకి పాకిస్థాన్‌కి ముడి పెట్టడం ఏంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్సు తప్ప ఈ ప్రభుత్వం ఇచ్చింది ఏమి లేదన్నారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలని హితవు పలికారు.

## అణ్వాయుధాలను పరీక్షిస్తున్న పాక్: ట్రంప్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ‘‘రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కానీ, వీటి గురించి ఆయా దేశాలు మాట్లాడట్లేదు. మేం అలా కాదు. ఏదైనా బహిరంగంగానే చేస్తాం. దాని గురించి మాట్లాడతాం. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా మేం వాటి జోలికి వెళ్లలేదు. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదు. ఇతర దేశాల మాదిరిగానే మేమూ ఈ పరీక్షలు నిర్వహిస్తాం’’ అని ట్రంప్ వెల్లడించారు.

## భారత్ టెక్ పవర్‌హౌస్‌గా ఎదిగేందుకు కృషి: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్ అత్యంత క్లిష్టమైన, అధిక ప్రభావం చూపే పరిశోధన అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం మరింత అభివృద్ధి చెందడానికి, భారత్ టెక్ పవర్‌హౌస్‌గా ఎదగడానికి ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో రూ.లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి ఫండ్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ ప్రసంగించారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణలను మరింత పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రైవేటు రంగాన్ని పరిశోధనల వైపు ప్రోత్సహించేందుకు ప్రస్తుతం రూ.లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

## మరో ఆరు నెలలు కాల్పుల విరమణ..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మావోయిస్టులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించారు. ఈ మేరకు మావోయిస్ట్ అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు తీవ్ర నష్టం జరుగుతున్న విషయం తెలిసిందే. ఒకప్పుడు నక్సల్స్‌కు కంచుకోటలుగా ఉన్న అడవులను సైతం బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. వందలాది మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. కీలక నేతలు సైతం హతం అవుతున్నారు. దీంతో ఆపరేషన్ కగార్ ఆపాలని కొంతకాలంగా మావోయిస్టులు డిమాండ్ చేస్తున్నారు. తాము చర్చలకు సిద్ధమని గతంలో ప్రకటించారు. అయితే కేంద్రం మాత్రం చర్చల ప్రసక్తే లేదని చెప్పింది.

## అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఉత్తర అఫ్గాన్ నగరంలో మజార్ - ఎ - షరీఫ్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున భూమి కంపించింది. మజార్ - ఎ - షరీఫ్ సమీపంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించిందని, కనీసం 10 మంది మరణించారని అధికారులు తెలిపారు. 150 మందికిపైగా గాయపడ్డారని అధికారులు పేర్కొన్నారు. భూకంప తీవ్రతతో భారీగా భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలిస్తున్నారు.

## ఓజీ నిర్మాత తనయుడికి జోడీగా సాక్షి వైద్య



సినీ ఇండస్ట్రీలో సక్సెస్ ఒక్కటే మాట్లాడుతుంది.. ఇది హీరోయిన్ల విషయంలో ఇంకా ఎక్కువగా ఉంటుంది. అందం, టాలెంట్ ఉన్నప్పటికీ హిట్లు లేకపోతే అవకాశాలు దొరకడం కష్టమే. అలాంటి పరిస్థితిని ఎదుర్కొన్న హీరోయిన్ సాక్షి వైద్య.. ఇప్పుడు మళ్లీ టాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. 2023లో ‘ఏజెంట్’, ‘గాండీవధారి అర్జున’ చిత్రాల్లో నటించినా ఫ్లాప్ అయ్యాయి. దీంతో ఆమె కెరీర్ ముగిసిందని టాక్ వినిపించింది. అయితే తాజాగా ఆమెకు మళ్లీ టాలీవుడ్ నుండి పిలుపు వచ్చింది. రెండేళ్ల గ్యాప్ తర్వాత, హీరో శర్వానంద్ నటిస్తున్న ‘నారీ నారీ నడుమ మురారి’ సినిమాలో సాక్షి హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే డీవీవీ దానయ్య కుమారుడు కళ్యాణ్ దాసరి హీరోగా పరిచయమవుతున్న ‘అధీర’ అనే సూపర్ హీరో మూవీలో సాక్షిని హీరోయిన్‌గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట.

– అక్షరటుడే, సినిమా డెస్క్